క్లుప్తంగా

మహానందీశుడికి పల్లకీ సేవ



పల్లకీలో విహరిస్తున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో మహానందీశ్వర దంపతులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవానికి ముందు స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఆశీనులుగావించారు. బలిహరణ పూజలు చేపట్టి ఆలయ ప్రాకారంలో పల్లకీని ఊరేగించారు. ధ్వజ స్తంభం వద్ద మహానందీశ్వరుడి దంపతులకు హారతులిచ్చి తిరిగి అలంకార మండపానికి చేర్చారు. వేడుకలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

సంతగేటు వేలంలో రూ.లక్ష ఆదాయం

పాములపాడు: మండల కేంద్రంలోని వారాంతపు సంత గేటు నిర్వహణ(2024–25)కు శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో రూ.1,00,116 ఆదాయం లభించిందని పంచాయతీ కార్యదర్శి తిప్పన్న తెలిపారు. పాటదారులు రూ.1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారని చెప్పారు. సంతలో ఏర్పాటు చేసుకునే దుకాణాలు, గ్రామంలోకి వ్యాపార నిమిత్తం వచ్చే వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే వసూలు చేయాలని వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చేతుల శుభ్రత ఎంతో ముఖ్యం

కొత్తపల్లి: చేతుల శుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యురాలు దీపానాగవేణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గువ్వల కుంట్ల అంగన్‌వాడీ సెంటర్–1లో డ యేరియాపై బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో కాచి చల్లార్చిన నీటిని తీసుకుంటే రోగాల బారినపడకు ండా ఉండవచ్చన్నారు. అలాగే భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. బాలింతలు, గర్భిణులు పౌ ష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. విరేచనాలు, వాంతులు, జ్వరం ఉంటే వెంటనే కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు సోమల స్రవంతి, ఏఎన్‌ఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమల కాల్వ గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అందరూ సహకరించాలని సర్పంచ్ పబ్బతి మేరీ పుష్పాంజలి పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధి, వివిధ పనులపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు గ్రామ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బరక సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసి న బరక సంజీవరాయ స్వామికి శుక్రవారం ప్రత్యే క పూజలు చేశారు. నరహరి శర్మ ఆధ్వర్యంలో ఉ దయం అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చ న,మన్యసూక్త హోమం, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయ, కర్పూరం సమర్పించి మొ క్కులు తీర్చుకున్నారు. పేరు సాహెబ్ పేట గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మురలబుమోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిల్లలకు పోషకాహారం దూరం

పగిడ్యాల: మధ్యాహ్న భోజన పథకం ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారం అందని ద్రాక్షగా మారింది. మూడు రోజులుగా మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వడం లేదన్న విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని పడమర పాతకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సాక్షి విజిట్ చేసింది. మెనూ ప్రకారం పిల్లలకు అన్నం, ఆకుకూర పప్పు, ఉడకబెట్టిన కోడిగుడ్డు ఇవ్వాల్సి ఉంది. అయితే కేవలం అన్నం, ఆకుకూర పప్పుతోనే సరిపెట్టారు. కోడిగుడ్డు ఇవ్వడం లేదని విద్యార్థులు తెలిపారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం సువర్ణను వివరణ కోరగా మూడు రోజులుగా కోడిగుడ్లు సరఫరా కాలేదన్నారు.

ఉపాధ్యాయుడిని దుర్భాషలాడడం దారుణం

నందికొట్కూరు: ప్రభుత్వ పాఠశాలలో రేషన్ బియ్యం ఉంచొద్దని చెప్పిన ఉపాధ్యాయుడిని బూతులు తిట్టిన టీడీపీ నాయకుడు, రేషన్ డీలర్ విజయభాస్కరరెడ్డిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు రోషన్న శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

జూపాడుబంగ్లా: కొలిమిగుండ్ల మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిని దూషించిన టీడీపీ నేతపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జాకీర్‌హుసేన్ డిమాండ్ చేశారు.

శ్మశాన వాటికల్లేని గ్రామాలకు స్థలాలు కేటాయిస్తాం

- సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్
- ప్రగతి నివేదికలను వెల్లడించిన వివిధ శాఖల అధికారులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

జూపాడుబంగ్లా: మండలంలో శ్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు గ్రామాల్లో శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చారని.. అవసరమైన చోట్ల స్థలాలు కేటాస్తామని తెలిపారు. అలాగే చాబోలు గ్రామస్తులకు జూపాడుబంగ్లాలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ఫారం భూములను గుర్తించి కలెక్టర్‌కు నివేదికలు పంపనున్నట్లు చెప్పారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ.. మండలాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. పి.లింగాపురంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చేయాలని సర్పంచ్ నాగార్జునరెడ్డి కోరారు. ఏఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా సాగు చేయాలని సూచించారు. మండలంలో 11 ఆర్బీకేలకు గాను 5 కేంద్రాలు మాత్రమే పూర్తయి కార్యకలాపాలు సాగుతున్నాయని.. మిగిలిన వాటిని హ్యాండోవర్ చేయలేదని తెలిపారు. పారుమంచాల బుచ్చిరెడ్డి కుంటలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరగకుండా చేయాలని ఎంఐ ఏఈ రామ్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. పారుమంచాల అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి స్థలం కేటాయించాలని సీడీపీఓ మంగవల్లి కోరారు. పి.లింగాపురంలో అంగన్‌వాడీ పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 6 ఏళ్లు పైబడిన 234 మంది చిన్నారులను పాఠశాలల్లో చేర్పించినట్లు వెల్లడించారు. హౌసింగ్ ఏఈ జ్యోతి 2019 నుంచి ఇప్పటి వరకు మంజూరైన గృహాల స్థితిగతులను వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంఈఓ చిన్న మద్దిలేటి, వైస్ ఎంపీపీలు రవణమ్మ, తోకల కృష్ణారెడ్డి, ఏఈ నాగేంద్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పదవులు అలంకారం కాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

మహానంది: పదవులు అలంకారం కాదని, ప్రజలు ఇచ్చిన బాధ్యత అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. గోపవరం, గాజులపల్లె గ్రామాల్లో శుక్రవారం రాత్రి థాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం ఇచ్చాక గత పాలకుల మాదిరి ప్రజల్లో తిరగకుండా ఉండే స్వభావం తమకు లేదని, ప్రతి గ్రామం పర్యటించి ప్రజల అభిమానాన్ని చూరగొంటామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, మాజీ ఎంపీపీ చింతం నాగమణి, నాయకులు గని చిన్న రంగస్వామి, చింతం క్రాంతి కుమార్, నందిరెడ్డి, మిస్త్రీ శివ పాల్గొన్నారు.

హైవే నిర్మాణానికి కొలతలు

పాములపాడు: కర్నూలు నుంచి నందికొట్కూరు, ఆత్మకూరు మీదుగా దోర్నాల వరకు 340సీ పేరుతో నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో భాగంగా అదనపు స్థల సేకరణ కోసం శుక్రవారం కొలతలు వేశారు. ఎన్‌హెచ్ జేఈ వైద్యనాథ్, మండల సర్వేయర్ భాస్కర్, వీఆర్వో ముర్తుజావలి పాములపాడులోని భారత్ పెట్రోల్ బంకు వద్ద నుంచి సుమారు 3 ఎకరాల మేర స్థలం అవసరం కావడంతో 60 మంది రైతులకు సంబంధించిన పొలాల్లో కొలతలు వేశారు. ప్రస్తుతం 60 మీటర్ల మేర వెడల్పుతో పనులు జరుగుతున్నాయని, అయితే అదనంగా స్థలం అవసరం కావడంతో మళ్లీ కొలతలు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎంత స్థలం కోల్పోవాల్సి వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

మహానంది: తమ్మడపల్లె గ్రామ సమీపంలోని సూర్యనంది ముఖద్వారం వద్ద ఉన్న మూడు దుకాణాల్లో ఒకే రోజు చోరీ జరిగిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. బొల్లవరం గ్రామానికి చెందిన కొండయ్య టీ,కాఫీ దుకాణం, తమ్మడపల్లె గ్రామానికి చెందిన మురళి మెకానిక్ షెడ్డు, మరొకరు హోటల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా గుర్తుతెలియని దుండగులు రాత్రి ఒకే రోజు మూడు షాపుల్లో చోరీకి పాల్పడ్డారు. మెకానిక్ షెడ్డులోని వస్తువులతో పాటు రెండు దుకాణాల్లో ఉన్న సిగరెట్లు, బీడీలు, మరికొన్ని వస్తువులను ఎత్తికెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. కేసు విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో సెక్యూరిటీ గార్డ్ మృతి



పోలయ్య (ఫైల్)

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మాణిక్యేశ్వరి మాత ఆలయం సమీపంలోనున్న లోయలో దేవస్థానంలోని అన్నపూర్ణ విభాగంలో పనిచేస్తున్న పోలయ్య (31) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం కనుగొన్నారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మాణిక్యేశ్వరి మాత ఆలయం సమీపంలోని గిరిజన గూడెంలో భార్య, కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నాడు. పోలయ్య వారం క్రితం కనిపించకుండా పోయాడు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పరిసర అటవీ ప్రాంతాల్లో గాలించారు. చివరకు పాతాళగంగ బ్యాక్ వాటర్ వచ్చే లోయ చివర అంచున రాళ్లపై మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వన్ టౌన్ ఎస్‌ఐ లక్ష్మణరావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రాజెక్టు వైద్యశాలకు తరలిస్తున్నామని, కేసు నమోదు చేసుకొని మృతికి గల కారణాలను విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఎకోడెవలప్‌మెంట్ నూతన కమిటీ ఎన్నిక



రూపస్‌ను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ఎకోడెవలప్‌మెంట్ నూతన కమిటీని శుక్రవారం అటవీ అధికారుల సమక్షంలో గ్రామస్తులు ఎన్నుకున్నారు. స్థానిక నాగార్జున సాగర్–శ్రీశైలం టైగర్‌రిజర్వ్ కన్జర్వేటర్ కార్యాలయంలో షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులా లకు చెందిన గ్రామస్తులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. చైర్మన్‌గా నాగెళ్ల రూపస్ అలియాస్ నాగేశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్‌గా కె.మనీషాబాయి, కమిటీ సభ్యులుగా టి.రాజేష్, డి.రోధి, డి.జీవన్‌కుమార్, పి. ప్రసాద్, డి.నాగశివకాంత్, బి.ప్రేమ్‌కుమార్, డి.సాయిరాణి, కె.భామినిబాయి, ఎం.నాగమణిబాయి, ఎం.అంజలీబాయి,ఎం.బాలాజీనాయక్, కె.అంక మ్మ, కె.వీరమ్మనుఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రేంజ్ అధికారి,ఎన్నికల అధికారి వి.నరసింహులు, సహాయకులుగా, డిప్యూటీ రేంజ్ అధికారి ఎస్.బషీర్‌అహ్మద్, సెక్షన్ ఆఫీసర్ కె.మధన్‌కుమార్, బీట్ ఆఫీసర్ .ఎ.రవీంద్రనాథ్‌ఠాగూర్ వ్యవహరించారు.

విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ



ఆత్మకూరులోని ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని విత్తన, ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ బృందం సభ్యులు డీడీఏ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ సీఐ సునీల్, ఏడీఏ ఆంజనేయలు తనిఖీ చేశారు. శుక్రవారం పట్టణంలోని విశ్వంభర సీడ్స్, శ్రీ లలిత ట్రేడర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, బిల్ బుక్‌లు, గ్రౌండ్ బ్యాలెన్స్‌ను పరిశీలించారు. నిల్వ ఉన్న విత్తనాలకు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలు, పురుగు మందులను, ఎరువులను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. సరైన ధ్రువపత్రాలు చూపనందున రూ.2,64,390 విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు వారు చెప్పారు.

వెలుగోడు: వ్యవసాయ శాఖ స్క్వాడ్ టీం సభ్యులు డీడీఏ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ సీఐ సునీల్, ఏవో పవన్ కుమార్ మండలంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీనివాస అగ్రో ఏజెన్సీస్‌లో రూ.5 లక్షల విలువజేసే అనుమతులు లేని బయో ఉత్పత్తుల అమ్మకాలను నిలుపుదల చేశారు. స్టాక్ బుక్కులు, ఇన్వాయిస్ బిల్స్ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. టెక్నికల్ ఏఓ అయూబు, ఏఈఓ సుధారాణి విస్తరణ సిబ్బంది రామకృష్ణ, అంజిత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కండరాల బలహీనతతో నొప్పులు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు సావిత్రి

పాములపాడు: కండరాల బలహీనతతో నొప్పులు వస్తాయని ఆయుర్వేద డాక్టర్ సావిత్రి అన్నారు. శుక్రవారం స్థానిక ఆయుర్వేద వైద్యశాల ఆవరణలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 60 ఏళ్లు పైబడిన వారికి నొప్పులు రావడం సర్వసాధారణమన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో 40 ఏళ్ల వారికీ కీళ్ల నొప్పులు వస్తున్నాయని చెప్పారు. కారణం ప్రొటీన్లు ఉన్న ఆహారం తీసుకోకపోవడమే అన్నారు. అల్పాహారంలో ఆకుకూరలు, గుడ్లు, బీన్స్ తీసుకోవాలని సూచించారు. కండరాల్లో బలం పెరిగితే నొప్పు తగ్గుతాయని వివరించారు. 50 ఏళ్ల పైబడిన వారు శరీరం చల్లగా ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా చర్మ వ్యాధులతో బాధపడుతూ తమ వద్దకు వస్తున్నారని తెలిపారు. నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నందికొట్కూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఐసీడీఎస్ కార్యాలయంలో ఏసీడీపీఓ మంగవలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీ ధర్నా చేయనున్నట్లు తెలిపారు.విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ, అంగన్‌వాడీ సంఘం నాయకులు గోపాలకృష్ణ, కృషిద్‌బీ, సాజిదాబేగం, నారాయణమ్మ, శ్యామల, స్వర్ణలత, కామెరూన్‌బీ, నాగమణి, హైమావతి, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి - ఆత్మకూరు

ఆటో అదుపుతప్పి యువకుడి దుర్మరణం



మృతి చెందిన కాటం నవీన్

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల గ్రామం వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో యువకుడు మృతి చెందాడు. పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన కాటం నారాయణ కుమారుడు కాటం నవీన్(23) శుక్రవారం రాత్రి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి స్వగ్రామానికి ఆటోలో వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని నందికొట్కూరు పోలీసులు వెల్లడించారు. సంఘటన స్థలానికి చేరుకున్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన సంరక్షణే.. మన సంరక్షణ



బైర్లూటి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మొక్క నాటుతున్న డీడీ సాయిబాబా

ఆత్మకూరురూరల్: వనాలను సంరక్షించడం ద్వారా సమస్త జీవజాలాన్ని కాపాడవచ్చని ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ వి.సాయిబాబా తెలిపారు. వన సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని బైర్లూటి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఎఫ్‌ఆర్‌వోలు సుభాష్, దొరస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులో మార్పులు



విద్యుత్ బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వెలుగోడు: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్‌పీడీసీఎల్) పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఫోన్‌పే, గూగుల్‌పే, అమెజాన్ పే ద్వారా కాకుండా ఏపీఎస్‌పీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా సంబంధిత వెబ్‌సైట్ బిల్ డెస్క్ ద్వారా బిల్లులను చెల్లించాలని ఏఈ రవీంద్ర నాయక్ తెలిపారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులపై శుక్రవారం వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఏఈ మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు ఇకపై వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంతోపాటు ఇతర యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం లేదన్నారు. ఏపీఎస్‌పీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా బిల్ డెస్క్‌కు అనుసంధానమైన ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంలతోపాటు ఇతర యూపీఐ యాప్స్ నుంచి బిల్లులను చెల్లించవచ్చని వివరించారు. వీటితో పాటు వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డుల ద్వారా కూడా చెల్లించవచ్చన్నారు.

నేడు పెంపుడు శునకాలకు వ్యాక్సినేషన్

పాములపాడు: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం పెంపుడు శునకాలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి అనీల్ తెలిపారు. శుక్రవారం స్థానిక పశు వైద్య కేంద్రంలో ఆయన మాట్లడుతూ.. మనుషులకు జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులను జూనోసిస్ డిసీజ్ అంటామని చెప్పారు. ప్రధానంగా కుక్క కాటు వల్ల వచ్చేది రేబీస్ వ్యాధి అన్నారు. మండలంలోని అన్ని వెటర్నరీ క్లీనిక్‌లలో యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నామని పేర్కొన్నారు. ప్రాణాంతకమైన రేబీస్‌ను నిర్మూలించడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

మహానంది: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి కరుణాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎం.తిమ్మాపురం, గాజులపల్లె గ్రామాల్లోని వెటర్నరీ డిస్పెన్సరీ ద్వారా పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేస్తారని చెప్పారు. పెంపుడు కుక్కలను పెంచుకునేవారు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పగిడ్యాల: పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం తాలుకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్‌కుమార్, పీతాంబరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం నందికొట్కూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా మిడుతూరు మండల సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నాగేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పీతాంబరరెడ్డి, జాయింట్ సెక్రటరీగా కె.మద్దమ్మ, కోశాధికారిగా విజయ్‌యాదవ్, జిల్లా కమిటీ మెంబర్లుగా రవీంద్రనాథ్‌రెడ్డి, రమేష్ బాబు, కో ఆప్షన్ సభ్యులుగా శ్రీనివాసులు, శంకరయ్యలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా మురళీమోహన్‌రెడ్డి వ్యవహరించారన్నారు.

యజమాని సంతకం లేకుండా కౌలు కార్డులివ్వాలి

ఆత్మకూరు: కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, కౌలురైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అష్రఫ్‌అలీ, పండ్లతోటల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా కోరారు. శుక్రవారం పట్టణంలోని నంద్యాల టర్నింగ్‌లో కౌలు రైతుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ముఖ్యమంత్రికి పంపేందుకు సంతకాల సేకరణ చేపట్టారు. వారు మాట్లాడుతూ జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు 70 శాతం మంది కౌలుపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారన్నారు.

బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు



బయలు వీరభద్ర స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని లోక కల్యాణం కోసం క్షేత్ర పాలకుడైన బయలు వీరభద్రస్వామి వారికి విశేషపూజలు నిర్వహించారు. ప్రతి మంగళవారం, అమావాస్య రోజుల్లో ఈ విశేషార్చనను జరిపించడం ఆనవాయితీ. అమావాస్య రోజున భక్తులు పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. ఈ రోజు పరోక్షసేవ ద్వారా 18 మంది భక్తులు విశేష పూజలను జరిపించుకున్నారు. పూజాదికాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ చేపట్టారు. అనంతరం పంచామృతాలు, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం చేశారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా స్వామి వారిని నాణేలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి స్వామివారికి ఆకుపూజ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పంటసాగు హక్కు పత్రం పొందాలి

ఆత్మకూరు: మండలంలోని కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డు లేదా పంట సాగుహక్కు పత్రం తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డు ఉంటేనే అన్నదాత సుఖీభవ, పంట నమోదు, పంటబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర వ్యవసాయ పథకాలు కౌలు రైతులకు వర్తిస్తాయన్నారు. కౌలు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కౌలుకు తీసుకున్న రైతు అందుకు సంబంధించిన అగ్రిమెంట్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, భూ యజమాని 1బీ తదితర జిరాక్స్ కాపీలతో స్థానిక రైతుభరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

అలరించిన గాత్ర కచేరీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వద్ద కరీంగనర్‌కు చెందిన డాక్టర్ విజయ రఘురామరాజు, బృందం గాత్రకచేరీ ఏర్పాటు చేశారు. కార్యక్రమములో శక్తి సహిత గణపతిం, రత్నగర్భ గణపతిం, నమశ్శివాయతే, నమోస్తు వాణీ, బ్రహ్మమురారి, నమశ్శివాయ నటేశ్వరాయ.. శ్రీ రాజ రాజేశ్వరి పాహిమాం, శంభో శివ శంభో కాలభైరవాష్టకం తదితర గీతాలను, అష్టకాలను కె.బి.శర్మ, సుకృతి, మేఘమాల, సరళ, డా. అక్షిత, జ్యోతి, రాధాకష్టవేణి, వినీల్, కౌముదిరాజు, భువన్, విఘ్నేశ్వర్ తదితరులు ఆలపించారు. ప్రసాద్ తబల సహకారం అందించారు.

పశువులకు వైద్య పరీక్షలు

నందికొట్కూరు: పశువుల్లో వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని పశువైద్యాధికారి వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి పరీక్షలు, చికిత్స శిబిరం నిర్వహించారు. 36 బర్రెలకు గర్భకోశ వ్యాధి, 20 దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. శనివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేయనున్నామని తెలిపారు. కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.